



అందెశ్రీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

వికారాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులు తమ పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం సెక్రటరియేట్ నుంచి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, సీఎస్ రామకృష్ణారావులతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ హాజరయ్యారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా వ్యవసాధికారి రాజారత్నం, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ మోహన్ కృష్ణ, డీసీఎస్‌వో సుదర్శన్, మార్క్‌ఫెడ్ మేనేజర్ మీన, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈవీఎం గోదాంను సందర్శించిన కలెక్టర్

జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గల ఈవీఎం గోదాంను కలెక్టర్ ప్రతీక్‌జైన్ సోమవారం సందర్శించారు. సాధారణ పరిశీలనలో భాగంగా తనిఖీ నిర్వహించారు. ఈవీఎంలకు వేసిన సీళ్లను పరిశీలంచి, సీసీటీవీ ద్వారా బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు, ఇతర ఎన్నికల సామగ్రిని భద్రపర్చిన విధానాన్ని తనిఖీ చేశారు. గోదాంలో ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు తీరుపైనా వాకబు చేశారు. అనంతరం రిజిష్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎన్నికల విభాగ పర్యవేక్షకుడు నేమత్ అలీ ఉన్నారు.

రేపు జాబ్‌మేళా

కీసర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఈ నెల 12న మేడ్చల్ ఐటీఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తామని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక సోమవారం తెలిపారు. జాబ్‌మేళా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు ఉంటుందని తెలిపారు. 19-34 వయసు గల నిరుద్యోగ యువతీయువకులు జాబ్‌మేళాలో పాల్గొనొచ్చని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, డిప్లమా, డిగ్రీ పాస్/ఫెయిల్ అయిన వారికి 15వేల నుంచి 20వేల వేతనంతో పలు ప్రైవేట్ ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు సకాలంలో కళాశాలలో అధికారులను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు 7893894857/ 8297291356/ 9963385011/7386809422 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అధికారి సూచించారు.



బస్సు సామర్థ్యానికి మించి ఎక్కుతున్న ప్రయాణికులు

రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో బస్సులు కిక్కిరిస్తుండటంతో ప్రజలు ఇబ్బందికరంగా ప్రయాణిస్తున్నారు. ఆక్యుపెన్సీకి రెట్టింపు సంఖ్యలో ప్రయాణికులు ఎక్కుతున్నారు. రద్దీకి అనుగుణంగా ఆర్టీసీ బస్సులను పెంచలేదు. సిబ్బంది సైతం అరకొరగానే ఉన్నారు. వికారాబాద్ జిల్లాలోని వికారాబాద్, పరిగి, తాండూరు డిపోల నుంచి హైదరాబాద్ నగరం, ఇతర పట్టణాలకు వెళ్లే బస్సుల్లో సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్నారు. డ్రైవర్, కండక్టర్లకూ ఇబ్బందులు తప్పడం లేదు. రద్దీ రూట్లలో సర్వీసులను పెంచాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణవ్యథ

కిక్కిరిస్తున్న బస్సులు.. బేజారవుతున్న ప్రయాణికులు

ప్రధాన రూట్లలో రెట్టింపు సంఖ్యలో ప్రయాణం.. అదనపు సర్వీసులు వేయని ఆర్టీసీ

సౌకర్యాల కల్పనపై పట్టని యంత్రాంగం.. బస్సుల సంఖ్య పెంచాలని ప్రజల డిమాండ్

జిల్లాలో ఆర్టీసీ సర్వీసులు ఇలా ...

డిపో	బస్సులు: ఆర్టీసీ	అద్దె	డ్రైవర్ల సంఖ్య	ఓఆర్(%)
తాండూరు	66	33	125	84
వికారాబాద్	51	19	98	92
పరిగి	48	31	98	90



వికారాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులు కిక్కిరిసి ప్రయాణిస్తున్నా అధికారులు అదనపు సర్వీసులు వేయడం లేదు. బస్సుల్లోని సీట్ల సామర్థ్యం కంటే రెండింతలు ఎక్కువగా ప్రయాణికులు ఎక్కుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు పల్లె వెలుగు, ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తుండడంతో 23నెలలుగా బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. అయితే పెరిగిన ప్రయాణికులకు అనుగుణంగా బస్సుల సంఖ్య పెంచక బస్సులన్నీ కిక్కిరిస్తున్నాయి. సూపర్ డీలక్స్ మినహా మిగతా బస్సులన్నీ ఆక్యుపెన్సీకి మించే రాకపోకలు కొనసాగుతున్నాయి. ఇలాంటి సమయాల్లో ఏమైనా ప్రమాదం జరిగితే నష్ట తీవ్రత ఎక్కువగా ఉంటోంది. నిల్చునేందుకు సైతం చోటు లేని విధంగా ప్రయాణించడం, అత్యవసర పరిస్థితుల్లో దిగేందుకు వీలు లేకపోవడం, అధిక రద్దీతో డ్రైవర్ నియంత్రణ కోల్పోవడం వంటి పరిణామాలు జరుగుతున్నాయి. ఇటీవల రంగారెడ్డి జిల్లా మీర్జాపూర్ వద్ద జరిగిన ప్రమాదమే ఇందుకు ఉదాహరణ. ఆ బస్సులో 72మంది ప్రయాణికులు ప్రయాణించగా, బస్సు డ్రైవర్‌తో

మిగతా 8వ పేజీలో...

అందెశ్రీకి నివాళి

మేడ్చల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) కవి, గేయ రచయిత, గాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు అందెశ్రీ మరణం బాధాకరమని పలువురు ఉపాధ్యాయులు అన్నారు. అందెశ్రీ మృతిపట్ల సోమవారం మేడ్చల్‌లో ఉపాధ్యాయులు నివాళులర్పించారు. పట్టణ పరిధి గిర్మాపూర్ పాఠశాలలో అందెశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి విద్యార్థులు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

స్పీకర్ దిగ్ర్భాంతి

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజాగాయకుడు అందెశ్రీ మరణం పట్ల తెలంగాణ రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ఆయన రచనలు, గానం కీలక పాత్ర పోషించాయని అన్నారు. తెలంగాణ రాష్ట్ర గీతం.. 'జయ జయహే తెలంగాణ..'ను రాసిన అందెశ్రీ మరణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటని పేర్కొన్నారు. అందెశ్రీ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రసాద్‌కుమార్ సానుభూతి తెలిపారు.



7

నిరుపేదలకు న్యాయం చేయాలి

- బీసీ ఉద్యమ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య
- ఇళ్ల పట్టాలకు పొజిషన్ చూపాలని కీసర ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



రామలింగేశ్వరుడికి రుద్రాభిషేకం చేస్తున్న భక్తులు



పూజల్లో జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి

రామలింగేశ్వరుడికి మహన్యాస రుద్రాభిషేకం

కీసరగుట్టలోని రామలింగేశ్వరస్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. కార్తీక ఉత్సవాల్లో భాగంగా మూడో సోమవారం గర్భాలయ మూల విరాట్‌కు పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకొని, దీపాలు వెలిగించి, శివ లింగాలకు అభిషేకాలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి స్వామి వారికి కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి కార్తీక దీపాలు వెలిగించారు.

- కీసర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)



శివలింగాలకు భక్తుల అభిషేకం





మెథడిస్టు జాతర ప్రాంగణం

జాతరకు మెథడిస్టు ప్రాంగణం ముస్తాబు

స్టేషన్ ధారూరు-దోర్నాల గ్రామాల మధ్య నేటి(మంగళవారం) నుంచి ప్రారంభమయ్యే 103వ క్రిష్టియన్ మెథడిస్టు జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. సోమవారం జాతర ప్రాంగణంలోని వేదికను అలంకరించారు. ప్రధాన వేదిక ముందు ద్వారాన్ని ముస్తాబు చేశారు. ఏసు శిలువలను అందంగా తీర్చిదిద్దారు. భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నారు. జాతరను హైదరాబాద్ రీజియన్ బిషప్ సీమోన్ ప్రారంభిస్తారు. ఉత్సవాల్లో పాస్టర్లు, లే లీడర్లు పాల్గొననున్నారు.

ధారూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి)

ఇష్టారాజ్యంగా పారిశ్రామిక వ్యర్థాల పారబోత

- ఇండస్ట్రియల్ పార్కులో యాజమాన్యాల నిర్లక్ష్యం
- రాకంచర్ల ప్రాంతంలో స్థానికుల ఇబ్బందులు
- కాలుష్య నివారణపై పట్టించుకోని పీసీబీ



రాకంచర్లలో ఆరుబయట పారబోసిన పరిశ్రమ వ్యర్థాలు

పూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల వ్యర్థాలను ఇష్టారాజ్యంగా బయట వదిలేస్తున్నారు. దీంతో స్థానికంగా కాలుష్యంతో పాటు దుర్వాసన వస్తోంది. పూడూరు మండలం రాకంచర్ల ఇండస్ట్రియల్ పార్కులో పలు పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమల యజమాన్యాలు ఇండస్ట్రియల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ విధానాన్ని పాటించడం లేదు. ప్రధానంగా జీపీల్(జీపీఈఎల్) ఇన్ఫ్రాస్ట్రక్చర్ కెమికల్ కర్మాగారం, వీబీఎస్ ఫ్యాక్టరీలు కెమికల్ వ్యర్థాలను కంపెనీ చుట్టుపక్కల పారబోస్తున్నారు. ఈ వ్యర్థాలతో వస్తున్న దుర్వాసనను తట్టుకోలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. జీపీల్ ఫ్యాక్టరీ వ్యర్థాలతో శ్వాసకోస వ్యాధులొస్తున్నాయంటున్నారు. పారిశ్రామిక వ్యర్థాలతో సమీప గ్రామాల్లో గాలిలో ఆక్సీజన్ శాతం తక్కువై, కర్బనాలు ఎక్కువై ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కెమికల్ వ్యర్థాలను తండా సమీపంలో పారబోస్తూ ఘన వ్యర్థాలను తగలబెడుతున్నారు. మంటలు, పొగతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. కాలుష్యంతో పంట భూములు, పెట్టిన పంటలపై ప్రభావం పడుతోంది. ఇన్ని ఇబ్బందులు కలుగుతున్నా, భరించలేని దుర్వాసన వస్తున్నా కాలుష్య నియంత్రణ మండలి పట్టించుకోవడం లేదు.

యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి



జీపీల్ కర్మాగారం నుంచి నిత్యం కెమికల్‌ను బయటికి వదులుతున్నారు. చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు రోగాలపాలవుతున్నారు. లాభాలేమో యాజమాన్యాలకు, రోగాలేమో ప్రజలకు వస్తున్నాయి. ఫ్యాక్టరీ వ్యర్థాలను ఆరుబయట వేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. ఇంత జరుగుతున్నా పీసీబీ, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు.

- కంకల్ రవీందర్, బీజేపీ జిల్లా కార్యదర్శి



టెండర్ జాక్‌పాట్!

- మద్యం షాపు దక్కడంతో కోటీశ్వరుడైన వ్యక్తి

కులకచర్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మద్యం దుకాణానికి వేసిన టెండర్ అతడి జీవితాన్ని మార్చేసింది. డ్రాలో షాపు దక్కడంతో కోటీశ్వరుడు అయ్యాడు. వివరాల్లోకి వెళ్తే.. కులకచర్లలో మొదటి మద్యం షాపు ఓసీకి, రెండో షాపును ఎస్సీలకు కేటాయించారు. రెండో షాపునకు 38 మంది టెండర్ వేశాడు. వీరిలో కులకచర్లకు చెందిన ఎస్సీ వర్గానికి చెందిన ఓ వ్యక్తి రూ.3లక్షల నాన్ రిఫండబుల్ ఫీజుతో టెండర్ వేశాడు. గత నెల 27న తీసిన లక్కీడిప్‌లో అతడి మూడో నంబర్ టోకెన్ ఎల్లడంతో అదృష్టం వరించింది. తనకొచ్చిన మద్యం షాపును సదరు వ్యక్తి మధ్యవర్తుల ద్వారా బేరం పెట్టాడు. చివరకు రూ.1.43కోట్లకు అమ్ముకున్నట్టు సమాచారం. అయితే మొదటి షాపు దక్కించుకున్న వారే రెండో షాపునూ తీసుకున్నట్టు తెలుస్తోంది.

ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్‌లో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యం ఇస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సూచించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి 65 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని, ఏమైనా సమస్యంటే మళ్లీ వారికి తెలియజేయాలని సూచించారు. పెన్షన్, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖ, భూసమస్యలకు సంబంధించిన ఫిర్యాదులొచ్చాయని, వాటిని పెండింగ్‌లో పెట్టకుండా తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, డీఆర్వో మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రజావాణికి 109 ఫిర్యాదులు

కీసర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో 109 ఫిర్యాదులు వచ్చినట్లు మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి తెలిపారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై, ఆయా శాఖలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కలెక్టర్ తెలిపారు.



కల్యాణలక్ష్మి చెక్కును అందజేస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

కల్యాణలక్ష్మి పేదలకు వరం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేద కుటుంబాలకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ పథకాలు వరం అని తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, నాయకులు రాజశేఖర్ రెడ్డి, మహిపాల్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోగా స్వర్ణకుమారి



స్వర్ణకుమారి, డీఎంహెచ్‌వో

వికారాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా స్వర్ణకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్లుగా పూర్తిస్థాయి డీఎంహెచ్‌వో లేక ఇన్‌చార్జిలతోనే సేవలు కొనసాగగా, ఇటీవల ప్రభుత్వం సివిల్ సర్జన్లకు కల్పించిన పదోన్నతుల్లో స్వర్ణకుమారిని వికారాబాద్ రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా నియమించారు. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ పవిత్ర నుంచి స్వర్ణకుమారి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను వైద్యారోగ్య శాఖ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. అనంతరం ఆమె కలెక్టర్ ప్రతీక్‌జైన్, అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్‌లను కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు.

సర్వే అధికారుల అడ్డగింత


అధికారులకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

కడ్తాల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు రీసర్వేకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. గ్రామ సభతో పాటు భూములు కోల్పోతున్న రైతులతో సమావేశం నిర్వహించి కోల్పోయే భూమికి ఏ మేర పరిహారం ఇస్తారో తెలిపాకే భూముల వద్దకు రావాలని అభ్యంతరం తెలిపారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి గ్రామ సమీపం మీదుగా నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణం పనులకు సంబంధించి పరిహారం అందించేందుకు భూముల్లో సాగుచేసిన పంటలు, పొలాల్లో ఉన్న చెట్లు, బోరుబావులు, తాటి చెట్లు, ఉద్యాన పంటల వివరాల సేకరణకు కలెక్టరేట్ నుంచి భూసేకరణ డీటీ విజయ్, కడ్తాల ఆర్ఐ వాహెద్‌లు, సీఐ గంగాధర్, సిబ్బందితో కలిసి ఎక్వాయిపల్లికి సోమవారం వచ్చారు. దాంతో రైతులు, స్థానికులు అక్కడికి చేరుకుని రోడ్డు నిర్మాణానికి తీసుకునే భూములకు పరిహారం ఎంత ఇస్తారో తెలుపకుండా, చర్చలు జరుపకుండా, అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోకుండా ఎలా సర్వేకు వచ్చారని అధికారుల ఎదుట వాపోయారు. స్పష్టత ఇచ్చేవరకు సర్వే చేపట్టవద్దని రైతులు అధికారులకు వినతిపత్రం అందజేశారు. రైతులతో కలెక్టర్ సమావేశం జరిపి పరిహారం తేల్చాకే సర్వే చేయాలని తెలుపడంతో అధికారులు వెనుదిరిగి పోయారు.



కలెక్టరేట్ ఎదుట కోకాపేట్ వాసుల నిరసన

వైన్ షాప్‌ను తరలించండి

» ఇబ్బంది పడుతున్న ప్రజలు

» కలెక్టరేట్ ఎదుట కోకాపేట్ వాసుల ఆందోళన

ఇబ్రహీంపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్‌లో ఆర్‌ఆర్ ఆర్ స్పిరిట్స్ లిక్కర్ షాప్, పర్మిట్ రూంను జనావాసాలకు దూరంగా తరలించాలంటూ పలు కాలనీల వాసులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. వైన్ షాపు కారణంగా కొందరు రోడ్లపైనే తాగుతూ న్యూసెన్స్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు, మహిళలు, ఉద్యోగులు ఈ రోడ్డుపై నుంచి వెళ్లడానికి భయపడుతున్నారని జెమ్ నక్షత్ర, సెరినిటీ పార్క్, ఎర్త్‌వుడ్స్ వాసులు ఆందోళన వెలిబుచ్చారు. ప్రజలకు అసౌకర్యంగా ఉన్న ఈ వైన్‌షాప్‌ను వెంటనే మరోచోటకు తరలించాలని కోరారు.

నెరవేరిన దశాబ్దాల కల

» ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశంలో ఎమ్మెల్యే శంకర్


దంపతులకు నూతన వస్త్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఓ పూట తిన్నా.. తినకపోయినా సొంతిల్లు ఉంటే బాగుండు అని నిరుపేదలు అనుకుంటారు.. అలాంటి కలను నెరవేరుస్తామని, అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇస్తామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని రాంనగర్ కాలనీలో మొట్ట మొదటి ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశానికి ఆయన హాజరై దంపతులకు నూతన వస్త్రాలు, కానుకలు అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొని.. ఇంటి గృహప్రవేశాలు చేసుకోవడం హర్షణీయమన్నారు. ఏఎంసీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొంకళ్ల చెన్నయ్య, అగ్గనూరు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, కొందుర్గు మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులకు అండగా ప్రభుత్వం


బాధితులకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధిత కుటుంబ సభ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య తెలిపారు. ఇటీవల మీర్జాగూడ సమీపంలో జరిగిన బస్సు ప్రమాద ఘటనలో భాగంగా మృతిచెందిన టిప్పర్ డ్రైవర్ ఆకాశ్ ధన్యా కామ్లే(23) కుటుంబ సభ్యులకు రూ.5లక్షల చెక్కును సోమవారం ఎమ్మెల్యే ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఆర్డీవో చంద్రకళ, డిప్యూటీ తహసీల్దార్ రాజేంద్ర, జూనియర్ అసిస్టెంట్ మహేందర్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, గోపాల్‌రెడ్డి, ఆగిరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

మరకత శివలింగాన్ని దర్శించుకున్న హైడ్రా కమిషనర్ సతీమణి


లావణ్యకు శివలింగం చిత్రపటాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): చందిప్ప గ్రామంలో గల మరకత శివలింగాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సతీమణి లావణ్య దర్శించుకున్నారు. సోమవారం మండలంలోని చందిప్ప గ్రామంలో 11వ శతాబ్దానికి చెందిన శ్రీ బ్రహ్మసూత్ర మరకత శివాలయంలో కార్తీక సోమవారం కావడంతో ఉదయం తశివలింగానికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆమెను సత్కరించి శివలింగం చిత్రపటాన్ని బహూకరించారు. ఎంపీడీవో వెంకయ్య, ఆలయ చైర్మన్ గోపాల్‌రెడ్డి, కమిటీసభ్యులు హన్మండు, అర్చకులు సాయిశివ, ప్రమోద్, వీరేశం తదితరులు ఉన్నారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం



శంషాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని సుప్రసిద్ధ శ్రీ వెండికొండ సిద్ధేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్తీక సోమవారం కావడంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా దేవాలయంలో ప్రత్యేకంగా నిర్వహించిన కార్తీక మాస దీపోత్సవంలో పాల్గొన్నారు. ప్రధాన పూజారి మాడుపతి నరేందర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కొండతో పాటు ప్రాంగణం కార్తీక దీపాలతో శోభాయమానంగా కనిపించింది.

నేడు రాంపల్లిదాయరకు మంత్రుల రాక

కీసర, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాంపల్లి దాయరలోని బాల వికాస కేంద్రానికి మంగళవారం రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ రానున్నారని బాల వికాస ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శౌరిరెడ్డి సోమవారం తెలిపారు. ఉదయం 10గంటలకు సోషల్‌స్టార్టప్ ఇంపల్స్-2025 పేరిట జరిగే ప్రారంభ కార్యక్రమంలో మంత్రులు పాల్గొంటారని, దేశవ్యాప్తంగా 1000మంది సామాజిక వ్యాపారవేత్తలు, ఇంపాక్ట్ ఇన్వెస్టర్లు, వ్యాపార రంగ నిపుణులు ఇందులో భాగస్వాములు అవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో 70కిపైగా సామాజిక వ్యాపార ఉత్పత్తులను సోషల్ స్టార్టప్ ఎక్స్‌పోలో ఆవిష్కరిస్తామని తెలిపారు.

హిజ్రాల వీరంగం

» డబ్బులు ఇవ్వనందుకు ఇంటి యజమానిపై దాడి

కీసర రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డబ్బులు ఇవ్వనందుకు ఇంటి యజమానిపై హిజ్రాలు దాడిచేసిన సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. బీహెచ్‌ఈఎల్‌కు చెందిన ప్రైవేట్ ఉద్యోగి సదానందం దమ్మాయిగూడ మున్సిపాలిటీ చీర్యాల్‌లోని బాలాజీ ఎన్‌క్లేవ్‌లో రెండు ఇళ్లను కొనుగోలు చేశాడు. మూడు నెలల కిందట తన తల్లి మృతిచెందడంతో గృహప్రవేశం కార్యక్రమాన్ని వాయిదా వేసుకున్నాడు. కాగా మూడు నెలల అనంతరం ఈ నెల 8న(శనివారం) తన ఇంటిని చూసుకునేందుకు తన భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి ఇక్కడికి చేరుకున్నారు. రాత్రి అక్కడే బస చేశారు. 9వ తేదీన(ఆదివారం) ఉదయం ఇద్దరు హిజ్రాలు అక్కడికి వచ్చి గృహప్రవేశం చేశారు కాబట్టి తమకు రూ.లక్ష ఇవ్వాలని సదానందను డిమాండ్ చేశారు. తన దగ్గర అంత డబ్బు లేదని, తను ఇవ్వలేనని, ఇబ్బందుల్లో ఉన్నానని ప్రాధేయపడినా వినలేదు. పైగా తనను, తన భార్య, పిల్లలను దర్భాషలాడటం మొదలుపెట్టారు. విసిగి పోయిన సదానందం వారిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారు మూడు ఆటోల్లో దాదాపు 15మంది హిజ్రాలు సదానందం ఇంటి వద్దకు వచ్చి అతడితో వాగ్వాదానికి దిగారు. పైగా గేటు పైకిఎక్కి దాన్ని విరగ్గొట్టే ప్రయత్నం చేశారు.


గాయాలతో సదానందం

సదానందరం వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా వారిలో కొంత మంది సదానందంపై కర్రలతో దాడి చేశారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సదానందం తలకు, శరీరానికి తీవ్రగాయాలు కావడంతో హిజ్రాలు అక్కడి నుంచి పరారయ్యారు. కాలనీ వాసులు సదానందంను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని బాధితుడి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. కుషాయిగూడ ప్రాంతానికి చెందిన హిజ్రాలను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఐదుగురిపై కేసు నమోదు చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు పోలీసులను కోరారు.

నిరుపేదలకు న్యాయం చేయాలి

కీసర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు న్యాయం చేయాలని బీసీ ఉద్యమ నాయకుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ మండలం, కాంచివానిసింగారంలో నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలు ఇచ్చి, పొజిషన్ ఇవ్వకుండా వేధిస్తున్నారని సోమవారం కీసర ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ ధర్నాకు ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. నిరుపేదలకు ప్రభుత్వం స్థలాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. పట్టాలు ఇచ్చినవారికి అధికారులకు స్థలాలు కేటాయించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం పోలీసులు ధర్నాను విరమింపచేశారు.

మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డికి సేవారత్న జాతీయ అవార్డు

చేవెళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మండలంలోని కమ్మెట గ్రామం మాజీ సర్పచ్ పట్లోళ్ల హన్మంత్‌రెడ్డికి సేవారత్న జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. అయితే కమ్మెట గ్రామానికి సర్పంచ్‌గా, వ్యక్తిగతంగా అనేక సేవ, అభివృద్ధి కార్యక్రమాలు చేసినందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నగరంలోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అవార్డు ఎంపిక పత్రాన్ని హన్మంత్‌రెడ్డికి అందజేశారు. డిసెంబర్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరిగే ఆల్ ఇండియా బహుజన రైటర్స్ 18వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ అవార్డును అందుకుంటారని చెప్పారు. హన్మంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామానికి అనేక సేవ కార్యక్రమాలు నిర్వహించిన తనకు ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. అలాగే కమ్మెట గ్రామం తాజీ మాజీ సర్పంచ్ తలారి తులసీరాజుకు ఉత్తమ సర్పంచ్ అవార్డుకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెంటయ్య, చేవెళ్ల మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోనే కరుణాకర్‌రెడ్డి, నాయకులు సురేందర్‌గౌడ్, ఆంజనేయులు బాలకృష్ణ, రాంచంద్రయ్య, వెంకటేశ్, సంపత్‌కుమార్, ఆనంద్ ఉన్నారు.



సేవారత్న జాతీయ అవార్డు ఎంపిక పత్రాన్ని అందుకుంటున్న మాజీ సర్పంచ్ హన్మంత్‌రెడ్డి


అమ్మవారి పూజలో భక్తులు

మైసిగండిలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

కడ్తాల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మైసిగండి మైసమ్మ దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ముగిశాయి. ఆరు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగాయి. ముగింపు వేడుకల్లో భాగంగా అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. భక్తుల మైసమ్మ నామస్మరణతో మైసిగండి దేవాలయం మార్మోగింది. పూర్ణాహుతితో ఆలయ ఫౌండర్ ట్రస్టీ రామావత్ సిరోలిపంతూ ఉత్సవాలను ముగించారు. టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు మైసిగండి మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో స్నేహలత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, తులసీరామ్ నాయక్, శేఖర్ గౌడ్, భాస్కర్, అరుణ్, జ్యోతి, ఆమనగల్లు ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, హీరాసింగ్, జవహర్‌లాల్ నాయక్, తులసీరామ్ నాయక్, పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యంగ్ ఓరేటర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఆయన సోమవారం తన ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ సుధీర్, మైనార్టీ సంక్షేమాధికారి రాజేశ్వరి, జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకాదేవి, యంగ్ ఓరేటర్స్ క్లబ్ జిల్లా ప్రోగ్రాం అధికారి విజయకుమార్‌తో కలిసి యంగ్ ఓరేటర్స్ క్లబ్ బాలల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 14వ తేదీన అన్ని పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించి వారి ఎదుట విద్యార్థులు యంగ్ ఓరేటర్స్ క్లబ్‌ల ద్వారా నేర్చుకున్న నైపుణ్యాన్ని ప్రదర్శించేలా సంసిద్ధం చేయాలని ఆయన తెలిపారు.

తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారులకు భరోసా

» ఎమ్మెల్యే, చీఫ్ విప్, ఎంపీల హామీ

తాండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): యాలాల మండలం హాజీపూర్ గ్రామానికి చెందిన లక్ష్మి, బందెప్ప దంపతులు చేవెళ్ల బస్సు ప్రమాదంలో మృతిచెందిన విషయం విదితమే. ఈ దంపతుల మృతితో వారి కూతుళ్లు భవానీ, శివలీల అనాథలయ్యారు. వీరికి అమ్మమ్మ తప్ప ఎవరూ లేరు. దీంతో బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్న వారికి ప్రజాప్రతినిధులు భరోసానిచ్చారు. ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పరామర్శించి ఎంత వరకు చదివితే అంత వరకు చదివించే బాధ్యత తాను తీసుకుంటానని హామీఇచ్చారు. తక్షణమే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశారు. అదేవిధంగా శాసనమండలి చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి పరామర్శించి పిల్లలు అనాథలు కాకుండా తమ ట్రస్టు ద్వారా ఆదుకుంటామని తెలిపారు. చిన్నారులకు ఎల్లవేళలా తోడ్పాటునందిస్తానని మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఎంత వరకు చదివితే అంత వరకు చదివిస్తానన్నారు. అదేవిధంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తమ ఆస్పత్రిలోనే నర్సింగ్ లేదా ఇతర ఉద్యోగం కల్పిస్తానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు మాజీ సర్పంచ్‌లు, ఈ కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు.

సీఎం చొరవతో అభివృద్ధి

» జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. బొంరాస్‌పేట్ మండలంలోని జానకంపల్లిలో రూ.29లక్షలతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. బొంరాస్‌పేట్-ముద్దాయిపేట్ నుంచి జానకంపల్లి, మహంతీపూర్ మీదుగా దేవనూర్ వరకు బీటీరోడ్డు పనులను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే గడిమైలారంలో సోమవారం రీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు గ్రంథాలయాలు, రీడింగ్ రూమ్‌లు అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, నాయకులు రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్, నర్సిములునాయుడు, మల్లికార్జున్, నాందార్‌పూర్ మల్లికార్జున్, దేశ్యనాయక్, అంజిలయ్య, మహిపాల్ పాల్గొన్నారు.


రీడింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి

ప్రకృతి పరిరక్షణకు పాటుపడాలి

» గోశాల నిర్వాహకుడు ధరంరాజ్‌రాంఖా


హోమం నిర్వహిస్తున్న నిర్వాహకులు

శంషాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రకృతిని రక్షించడమే నిజమైన ఆరాధన అని, అందుకోసం ప్రతీ ఒక్కరూ పాటుపడాలని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని సత్యం శివం సుందరం గోశాల నిర్వాహకుడు ధరంరాజ్‌రాంఖా అన్నారు. సోమవారం గోశాలలో అన్నకూట్ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాల ఆవరణ ఏర్పాటుచేసిన మహా హోమంలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ధరంరాజ్ మాట్లాడుతూ ప్రేమ, విశ్వాసం, పర్యావరణ పరిరక్షణ కోసం అన్నకూట్ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పలువురు కళాకారులు ప్రకృతిపై ప్రదర్శన నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో రాజీవ్ స్వగృహ ప్లాట్ల వేలం

» ఈనెల15 వరకు రిజిస్ట్రేషన్ గడువు

హైదరాబాద్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): స్వగృహ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి చేసిన లేఅవుట్లలోని ప్లాట్లనుబహిరంగ వేలం ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నగరానికి సమీపంలో ఉన్న తొర్రూర్, బహదూర్‌పల్లి, కుర్మల్‌గూడ ప్రాంతాల్లోని 163 ఓపెన్ ప్లాట్లను నవంబరు 17, 18 తేదీల్లో బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు కార్పొరేషన్ డైరెక్టర్ వీపీ గౌతం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓఆర్‌ఆర్‌కు చేరువలోని తొర్రూర్‌లో 200 నుంచి 500 గజాల విస్తీర్ణంలో ఉన్న 125 ప్లాట్లు, కుర్మల్‌గూడలో 200-300 గజాల విస్తీర్ణంలో ఉన్న 25 ప్లాట్లు, బహదూర్‌పల్లిలో 200- 1000 గజాల విస్తీర్ణంలో ఉన్న 13 ప్లాట్లను విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ ప్లాట్లలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించామని, రిజిస్ట్రేషన్‌కు ఈనెల 15 వరకు గడువు ఉందని తెలిపారు. పెద్ద అంబర్‌పేటలోని అవికా కన్వెన్షన్‌లో వేలం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

రుణాలు మంజూరు చేయాలి

» డీఆర్డీవో సాంబశివరావు

శామీర్‌పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బ్యాంకర్లు ఇబ్బందులు పెట్టకుండా స్వయం సహాయక సంఘాలకు (సెల్ఫ్ హెల్ప్ గ్రూప్స్), పీఎం స్వయంనిధి గ్రూపులకు, చిన్న తరహా స్వయంఉపాధి వ్యాపారులకు రుణాలను మంజూరు చేయాలని మేడ్చల్ డీఆర్డీవో సాంబశివరావు సూచించారు. శామీర్‌పేట ఎంపీడీవో హాల్‌లో సోమవారం జిల్లా లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో కెనరాబ్యాంక్ శామీర్‌పేట బ్రాంచ్ సహకారంతో డీఆర్డీవో సాంబశివరావు వివిధశాఖల బ్యాంకర్లతో జాయింట్ మున్సిపల్ లెవెల్ బ్యాంకర్స్ కమిటీ(జేఎంఎల్‌బీసీ), బీఎల్‌బీసీ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ.. ప్రాధాన్యత రంగాలైన రిటైల్ అగ్రికల్చర్, ఎమ్మెస్‌ఎంఈ, హెచ్‌ఎల్, ఈఎల్, ఎస్‌హెచ్‌జీ లింకేజీలు, పీఎం స్వయంనిధి, పీఎం పథకాల వారికి, స్వయం ఉపాధి వర్తకులకు సకాలంలో రుణాలను మంజూరు చేయాలన్నారు. జిల్లా లీడ్‌బ్యాంక్ అధికారి శివప్రసాద్ మాట్లాడుతూ.. సంబంధిత బ్యాంకుల వారు మంజూరు చేస్తున్న రుణాల పట్ల తప్పనిసరిగా ఏసీపీ లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో శామీర్‌పేట డీపీఎం విలాస్ రావు, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, వ్యవసాయాధికారి రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సీడ్‌తో ఎంతో మేలు


రైతులతో వ్యవసాయ శాస్త్రవేతలు, అధికారులు

కేశంపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఫౌండేషన్ సీడ్‌తో ఎంతో మేలు ఉంటుందని, విత్తనాల సమస్య పరిష్కారమవుతుందని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీదేవి తెలిపారు. చౌల్లపల్లికి చెందిన జిల్లెల శ్రీనివాసులు, సాటు భూపాల్‌లు రాజేంద్రనగర్ వరిపరిశోధన కేంద్రంలో ఆవిష్కరించిన కేఎన్ఎం 1638 విత్తన రకాన్ని సాగు చేశారు. ఈ వరి పైరును సోమవారం షాద్‌నగర్ ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాధికారి శిరీష, ఏఈవోలు నిఖిల్, ప్రశాంత్, సుధాలు రైతులతో కలిసి శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత శ్రీదేవి మాట్లాడుతూ ఫౌండేషన్ సీడ్‌తో రైతులు స్వతహాగా విత్తనోత్పత్తి చేసుకుని నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఏడీఏ మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ గ్రామానికి ముగ్గురు రైతులకు కేఎన్ఎం 1638 విత్తనోత్పత్తి విత్తనాల మినీ కిట్లను అందించామని వివరించారు. ఈ సందర్భంగా రైతులను అభినందించారు.


కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఎన్‌పీఆర్డీ సభ్యులు

దివ్యాంగుల సంక్షేమ శాఖను ‘ప్రత్యేకం’గా గుర్తించాలి

ఇబ్రహీంపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహిళా శిశు సంక్షేమ శాఖ నుంచి దివ్యాంగుల సంక్షేమ శాఖను వేరుచేసి ప్రత్యేక శాఖగా గుర్తిస్తూ జీవో నెంబర్-34ను అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక(ఎన్‌పీఆర్డీ) డిమాండ్ చేసింది. ఈమేరకు సోమవారం ఎన్‌పీఆర్డీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సభ్యులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌పీఆర్డీ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కోని రాజు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మూడేళ్ల క్రితం తీసుకువచ్చిన జీవో-34ను అమలు చేస్తూ జిల్లాస్థాయిలో వికలాంగుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను తిరిగి నియమించాలని కోరారు.

తూతూమంత్రంగా ప్రజావాణి

బొంరాస్‌పేట్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని అధికారులు తూతూమంత్రంగా కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. మండల స్థాయిలో ప్రతీ కార్యాలయం నుంచి అధికారి హాజరుకావాల్సి ఉండగా కింది స్థాయి ఉద్యోగులను పంపించడం పలువురు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మండలస్థాయి అధికారి ఎంపీడీవో ఒక్కరే హాజరయ్యారు.

ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నికపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న నాయకులు

మేడ్చల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన సదానందం గౌడ్‌ను ఎన్నుకోవడం పట్ల జిల్లా ఎస్టీయూ నాయకులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. నేరేడ్ మేట్ జడ్పీహెచ్ఎ‌స పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సదానందం గౌడ్ ఎస్టీయూకు అందించిన సేవలను గుర్తిస్తూ రాష్ట్ర అధ్యక్షుడిగా అవకాశం కల్పించటం అభినందనీయమని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి విఠల్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ప్రేమ్ కుమార్

ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జిల్లా నుంచి జాకట ప్రేమ్‌కుమార్ ఎన్నికయ్యారు. నగరంలో సోమవారం నిర్వహించిన ఎస్టీయూటీఎస్ రాష్ట్ర ఎన్నికల్లో ఆయన ఉపాధ్యక్షుడిగా పోటీ చేశారు.

రైతులకు గిట్టుబాటు ధర


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వజ్రేష్‌యాదవ్

శామీర్‌పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు గిట్టుబాటు ధర అందుతోందని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి, లక్ష్మాపూర్ గ్రామాల్లో సోమవారం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ముఖ్యఅతిథిగా వజ్రేష్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలుయాదవ్, రైతు సహకార సంఘం చైర్మన్ మధుకర్‌రెడ్డిలతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, వెంకటేశ్, జగన్నాథం పాల్గొన్నారు.

కులకచర్ల: మండలంలోని తిరుమలాపూర్, అంతారం తదితర గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాలను డీసీసీబీ డైరెక్టర్, కులకచర్ల సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్యలు డీసీసీ ఉపాధ్యక్షుడు భీమ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బక్కారెడ్డి, కొండయ్యగౌడ్, గోపాల్‌నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

ఘట్‌కేసర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడలో సోమవారం బంజారాల దైవం జగదాంబ మాత, గురువు సంత్‌సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, నర్సింహ, రూప్‌సింగ్ నాయక్, రెడ్డియా నాయక్, సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

మంత్రి అజారుద్దీన్‌కు శుభాకాంక్షలు



శామీర్‌పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నూతన మంత్రిగా పదవీ బాధ్యతలను చేపట్టిన మాజీ క్రికెటర్ మహ్మద్ అజారుద్దీన్‌ను సోమవారం శామీర్‌పేటకు చెందిన రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఎన్నికలు నిర్వహించాలి

కీసర రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల సముదాయంలో ఫెడరేషన్ ఎన్నికలు నిర్వహించాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా వాణిలో కలెక్టర్ మనుచౌదరికి వినతి పత్రం అందజేశారు.

అందెశ్రీ మృతి కవిలోకానికి తీరని లోటు


దౌల్తాబాద్: అందెశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

పరిగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వాగ్గేయకారుడు, తెలంగాణ జాతీయ గీత రచయిత అందెశ్రీ మరణం కవిలోకానికి తీరని లోటని ప్రముఖ రాజకీయ, సామాజిక విశ్లేషకులు డాక్టర్ పి.భాస్కర యోగి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందెశ్రీ తెలంగాణ పాటయి ప్రవహించాడని గుర్తు చేశాడు. తెలంగాణ సాధనలో జయ, జయహే తెలంగాణ గేయం కోట్లాది ప్రజల గొంతుకై నిలిచిందని గుర్తు చేశారు. తెలంగాణ గేయం కేవలం చీఫ్ ఎంటర్టైన్మెంట్ కాదని, అది పదునైన ఆయుధమని కొనియాడారు. ఆయన లేనిలోటు తీరనిదన్నారు.

దౌల్తాబాద్: కవి, గేయ రచయిత, గాయకుడు, ఉద్యమకారుడు అందెశ్రీ మరణం బాధాకరమని దౌల్తాబాద్ మండలం న్యూమాస్టర్ మైండ్ పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. పాఠశాల ఆవరణలో సోమవారం అందెశ్రీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజా, అరుణ్, కరస్పాండెంట్లు సతీశ్, నర్సిములు, టీచర్లు బసంత్‌రెడ్డి, నాగరాజు, మాణిక్యప్ప, డేనియల్, విజయలక్ష్మి, స్రవంతి పాల్గొన్నారు.

పేదింటి మహిళకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న అరుణ

పెద్దేముల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఒక పేదింటి మహిళ డాక్టరేట్‌ను సాధించింది. పెద్దేముల్ మండలం బండపల్లి గ్రామానికి చెందిన అండాల అరుణ చరిత్ర విభాగంలో డాక్టరేట్ దక్కించుకుంది. 'కల్చర్ అండ్ ఫెస్టివల్స్ ఆఫ్ తెలంగాణ ఏస్టడీ ఆన్ వికారాబాద్ డిస్టిక్' అనే అంశంపై ఆచార్య అరుణపరిటి పర్యవేక్షణలో పరిశోధన నిర్వహించారు. ఆమె పరిశోధన అనంతనం రికార్డులను పరిశీలించి ఉస్మానియా యూనివర్శిటీ నుంచి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. అరుణ డాక్టరేట్‌ను సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

ప్రయాణ వ్యథ

(ఐదో పేజీ తరువాయి)

సహా 19మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 34మంది క్షతగాత్రులైన విషయం తెలిసిందే. ఉచిత బస్సు ప్రయాణంతో పెరిగిన మహిళా ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా ఒక్కో డిపోకు 15 నుంచి 20 బస్సులను అదనంగా కేటాయించాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ప్రధాన రూట్ల బస్సు సర్వీసుల్లో సీట్ల సంఖ్య కంటే ఒకటిన్నర నుంచి రెండు రెట్ల మేర అధికంగా ప్రయాణం కొనసాగిస్తున్నారు.

ఈ రూట్లలో నరకయాతన...

తాండూరు, వికారాబాద్, పరిగి, కొడంగల్ ప్రాంతాల నుంచి హైదరాబాద్ వెళ్లే బస్సుల్లో ఎక్కువ మంది నిల్చొనే ప్రయాణిస్తున్నారు. రద్దీ సమయాల్లో సర్వీసుల్లేక ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. ఈ రూట్లలో నడిచే సర్వీసుల్లో రెండు, మూడు బస్సులు మినహా మిగతా బస్సులన్నీ రద్దీగా ఉంటున్నాయి. గుంతలమయమైన రోడ్లు, మలుపులు, అతివేగంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. దూర ప్రాంతాలకు సీట్లలో కూర్చొని ప్రయాణించడమే ఇబ్బందికరంగా మారితే ఇక నిలబడేవారు యాతన పడుతున్నారు. తాండూరు నుంచి హైదరాబాద్, మహబూబ్‌నగర్ రూట్లలో నిత్యం కిక్కిరిసి ప్రయాణిస్తున్నారు. అన్నిరూట్లలో సగటున చూసుకుంటే మగ ప్రయాణికుల కంటే ఆడవారే ఎక్కువ మంది ఉంటుండటం గమనార్హం. పరిగి నుంచి హైదరాబాద్, షాద్‌నగర్ రూటు బస్సులన్నీ రద్దీగా ఉంటున్నాయి. వికారాబాద్ నుంచి నస్కల్-పరిగి, హైదరాబాద్ మార్గాల్లో బస్సుల సామర్థ్యానికి మించి ప్రయాణిస్తున్నాయి. వికారాబాద్ డిపో నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీసులు తక్కువ. తాండూరు నుంచి వచ్చే బస్సులపైనే ఆధారపడుతున్నారు. తాండూరు నుంచే సీట్ల సంఖ్యకు మించి ప్రయాణికులు ఉంటున్నారు. దీంతో వికారాబాద్‌లో ఎక్కే వారు నిలబడే హైదరాబాద్ వరకు ప్రయాణిస్తున్నారు. ఈ నేపథ్యంలో రద్దీ రూట్లలో బస్సు సర్వీసుల సంఖ్యను 25శాతమైనా పెంచాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. అలాగే ప్రతి 15-20నిమిషాలకో సర్వీసు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రజలంటున్నారు.

65శాతం మంది ఉచిత ప్రయాణమే!

తాండూరు, పరిగి, వికారాబాద్ ఆర్టీసీ డిపోల పరిధిలో రోజూ 80 నుంచి 90వేల మంది ప్రయాణికులు బస్సుల్లో రాకపోకలు కొనసాగిస్తున్నారు. వీరిలో 60 నుంచి 65శాతం మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేస్తున్నారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో సాధారణంగా 60శాతం వరకు ఉండే ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) ఉచితంతో 85 నుంచి 95 శాతానికి పెరిగింది. తాజా ఓఆర్ పరిశీలిస్తే.. వికారాబాద్ డిపోలో 92 శాతం, పరిగి డిపోలో 90శాతం, తాండూరు డిపోలో 84శాతంగా నమోదైంది. రద్దీగా మార్గాల్లో ఓఆర్ వంద శాతానికిపైగా నమోదవుతోంది.

అదనపు డ్యూటీలతో ఇబ్బందులు

డిపోల్లో సరిపడా సిబ్బంది లేక సతమతమవుతున్నారు. డ్రైవర్లకొరత ఎక్కువగా ఉంది. దీంతో డ్రైవర్లకు అదనపు విధులు కేటాయిస్తున్నట్లు తెలుస్తోంది. విశ్రాంతి లేక, అత్యవసర, వ్యక్తిగత పనులతో తాము అదనపు విధులు నిర్వహించలేమని డ్రైవర్లు చెబుతున్నా.. డిపో అధికారులు విధులకు వచ్చేలా ఒత్తిడి తెస్తున్నారనే ఆరోపణలొస్తున్నాయి. విశ్రాంతి, ఏకాగ్రత లేక కొందరు డ్రైవర్లు విధులను సక్రమంగా నిర్వహించలేకపోతున్నారని సిబ్బంది ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అధికారుల మాట వినకపోతే తమకు వేధింపులు తప్పవని అదనపు డ్యూటీలు చేస్తున్నారు. డిపోల్లోని బస్సుల్లో కొన్ని కాలం తీరినవి ఉండడంతో ఇబ్బందులు రెట్టింపవుతున్నాయి. ప్రయాణికుల భద్రత, సౌకర్య దృష్ట్యా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆలయాల్లో భక్తుల సందడి


ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లో శ్రీరామ కళ్యాణ కామేశ్వరి నవశక్తి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపాలు వెలిగించారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

కీసర రూరల్: నాగారం శ్రీరమాసత్యనారాయణ స్వామి ఆలయంలో అభిషేకం చేస్తున్న భక్తులు




ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ఆలయంలో అన్నదానం

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ


అయ్యప్ప మహాపడి పూజలో భక్తులు

వికారాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో సోమవారం సాయంత్రం మాజీ మునిసిపల్ చైర్మన్ సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆయన కుమారుడు అరవింద్ స్వామి అయ్యప్ప మహా పడిపూజ నిర్వహించారు. ఈపూజలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అయ్యప్ప స్వాములు రవిపంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన పాటలకు పేటతుల్లి ఆడడంతో వికారాబాద్ ప్రాంతంలో అయ్యప్ప నామస్మరణతో నిండిపోయింది.


పడిపూజకు హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

మేడ్చల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తగు ఏర్పాట్లు చేసినట్లు అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి తెలిపారు. సీఎస్ రామ కృష్ణారావు, మంత్రులు తుమ్మల నాగేశ్వరావు, ఉత్తంకుమార్ రెడ్డిలు కలెక్టర్లతో సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పరిస్థితులను తెలుసుకుంటున్నారని తెలిపారు. మొక్కజొన్న కొనుగోళ్లపై పరిమితి పెంచడంతో రైతుల వద్ద నుంచి మంచి స్పందన లభిస్తోందని తెలిపారు. జిల్లాలో వరి సాగుచేసే రైతులు అధికమని తెలిపారు.

మోసపోయాం.. న్యాయం చేయండి


కులకచర్ల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంతారం గ్రామ రైతులు

కులకచర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): భూములు, డబ్బులు పోగొట్టుకుని మోసపోయామని, తమకు న్యాయం చేయాలని రైతులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. అంతారం గ్రామానికి చెందిన రైతులు వెంకటేశ్, పాండు, కృష్ణయ్య, లక్ష్మయ్య, రాములు, శ్రీనివాస్‌లకు చెందిన 5 ఎకరాల 31 గుంటల భూములకు వడ్డీకి డబ్బులు ఇస్తామని ఆశచూపి డబ్బులు ఇవ్వకుండానే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. గత ఫిబ్రవరిలో రైతుల ఫిర్యాదు మేరకు పోలీసులు షాద్‌నగర్‌కు చెందిన దేవేందర్‌రెడ్డి, రత్నమ్మ, మనోజ్‌కుమార్, గణేశ్, మురళీలను రిమాండ్ చేశారు. మిగతా ముగ్గులరు హైకోర్టును ఆశ్రయించారు. భూములు వారి పేరుపై ఉన్నాయి. తమకు డబ్బులు అందలేదని, వడ్డీకి డబ్బులు ఇస్తామని తమను మోసం చేశారని న్యాయం చేయాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. అనంతరం తహసీల్దార్ మనోహరచక్రవర్తికి వినతిపత్రం అందించారు. ఈ కేసు కోర్టు పరిధిలో కొనసాగుతుందని విచారణతో తగుచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. వీరికి మద్దతుగా పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

తాండూరు మండల పంచాయతీ అధికారిగా వినయ్ కుమార్



తాండూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పంచాయతీ అధికారిగా వినయ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఆయన సోమవారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జి మండల పంచాయతీ అధికారి వీరప్ప ఆయనకు బాధ్యతలను అప్పగించారు. వినయ్‌కుమార్ ఇటీవల అప్పాడ్‌లో శిక్షణ పొందిన నూతనంగా మండల పంచాయతీ అధికారిగా ఎంపికయ్యారు. దీంతో మండల పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి తన జాయినింగ్ రిపోర్ట్‌ను అధికారులకు అందజేశారు.

బషీరాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా విశ్వప్రసాద్

బషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ ఇన్‌చార్జి ఎంపీడీవోగా తాండూరు ఎంపీడీవో విశ్వప్రసాద్‌కు బాధ్యతలను అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అడిషనల్ జడ్పీ సీఈవో సుధీర్‌బాబు సోమవారం వెల్లడించారు. ఇక్కడి రెగ్యూలర్ ఎంపీడీవో తిరుమలస్వామి దీర్ఘకాలిక సెలవులో వెళ్లారు. సూపరింటెండెంట్ విజయకుమారికి బాధ్యతలు అప్పగించినప్పటికీ ఆమె మెడికల్ లీవ్‌పై వెళ్లినట్లు కార్యాలయ అధికార సిబ్బంది చెబుతున్నారు. దీంతో తాండూరు ఎంపీడీవోకు ఇక్కడి బాధ్యతలు అప్పటించినప్పటికీ ఆయన బాధ్యతలు స్వీకరించలేదు.

క్రైం కార్నర్

బస్సు ఢీకొని ఆర్టీసీ ఉద్యోగి మృతి

● ఆర్టీసీ పరిగి డిపోలో ఘటన


అబ్దుల్ ఖుద్దూస్(ఫైల్)

పరిగి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పరిగి ఆర్టీసీ డిపోలో బస్సు ఢీకొని ఓ ఉద్యోగి మృతి చెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా పరిగి డిపోలో చోటుచేసుకుంది. ఘటన వివరాలిలా ఉన్నాయి. తాండూరుకు చెందిన అబ్దుల్‌ఖుద్దూస్(59) పరిగి ఆర్టీసి డిపోలో మెకానిక్ సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్నాడు. విధుల్లో భాగంగా అతడు సోమవారం ఉదయం పరిగి డిపో గేట్ సెక్యూరిటీ కార్యాలయం వద్ద నిల్చున్నాడు. డిపో లోపలి నుంచి వచ్చిన బస్సు(ఏపీ29 జెడ్3489)ను డ్రైవర్ వెంకటేశ్ నిర్లక్ష్యంగా నడిపి అబ్దుల్‌ఖుద్దూస్‌ను ఢీకొట్టాడు. తలకు తీవ్రగాలైన ఖుద్దూస్‌ను సిబ్బంది వెంటనే ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అబ్దుల్ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఖుద్దూస్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోహన కృష్ణ తెలిపారు.

చెరువులో దూకి యువతి ఆత్మహత్య

మేడ్చల్ టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) చెరువులో దూకి ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ పట్టణం కింది బస్తీ ప్రాంతానికి చెందిన మౌనిక(19) మృతదేహం సోమవారం సాయంత్రం మేడ్చల్ పెద్ద చెరువులో కనబడటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని చెరువు నుంచి వెలికి తీసి ఆమె కుటుంబసభ్యులుకు సమాచారం ఇచ్చారు. విచారణలో కుటుంబ సభ్యులు మందలించటంతో మౌనిక ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరంలోని గాంధీ మార్చురీకి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఓఆర్ఆర్‌పై వాహనం బోల్తా

మేడ్చల్ టౌన్, నవంబర్ 10 (ఆంధ్రజ్యోతి): అద్దాల లోడ్‌తో వెళ్తున్న ఓ వాహనం ఓఆర్ఆర్‌పై బోల్తాపడింది. దీంతోట వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులు, ఓఆర్ఆర్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. పటాన్‌చెరు నుంచి మేడ్చల్ వైపు అద్దాల లోడ్‌తో వస్తున్న ఓ వాహనం అదుపుతప్పి మేడ్చల్ ఓఆర్ఆర్ ఎగ్జిట్ సమీపంలో బోల్తాపడింది. దీంతో వాహనంలోని అద్దాలు పగిలి రోడ్డుపై చెల్లాచెదురుగా పడటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. విషయం తెలుసుకున్న ఓఆర్ఆర్ పెట్రోలింగ్ సిబ్బంది, స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని రోడ్డుపై చెల్లాచెదరంగా పడిన అద్దాలను ఓపక్కకు జరపడంతో వాహనాల రాకపోకలు కొనసాగాయి.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దొంగలు ఏకంగా ట్రాన్స్‌ఫార్మర్‌నే చోరీచేశారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్ పరిధి ఎదులాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎదులాబాద్‌లోని లక్ష్మినారాయణ చెరువు అలుగు సమీపంలో విద్యుత్ అధికారులు 15కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలో అధికారులు ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను వినియోగించేవారు. ఆదివారం రాత్రి వరకు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ సోమవారం ఉదయం కనిపించలేదు. దీంతో విద్యుత్ అధికారులు, సిబ్బంది పరిసరాలను వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బషీరాబాద్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇసుక తరలించే ఓట్రాక్టర్‌ను బషీరాబాద్ పోలీసులు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. ఎస్ఐ నుమాన్‌అలీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. దామర్‌చెడ్ సమీపంలో డ్రైవర్ ఎర్ర శ్రీనివాస్ అక్రమంగా వాగులోంచి ఇసుకను తరలిస్తున్నాడనే సమాచారంతో పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసుల రాకను గమనించిన డ్రైవర్ ట్రాక్టర్‌లోని ఇసుకను అక్కడే ఖాళీ చేయడం గమనించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు ఎస్ఐ వెల్లడించారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్‌కు అప్పగిస్తామని ఆయన పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మృత్యుగుంతల పరిశీలన


గుంతలను పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

ఘట్‌కేసర్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'మృత్యు గుంతలు' అనే శీర్షికతో ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయా శాఖల అధికారులు స్పందించారు. మైనింగ్ ఆర్ఐ నాగమణి, రెవెన్యూ ఆర్ఐ సాయిరాం, అన్నపూర్ణ, పోలీసులు సోమవారం గుంతలను పరిశీలించారు. ప్రమాదకరంగా ఉన్న భారీ గుంతల విషయమై తగు చర్యలు చేపడతామన్నారు. అక్కడ ఉన్న కాపాలాదారున్ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం భూయజమానులకు ఫోన్ చేసి వివరాలు సేకరించారు. ఈవిషయమై లోకాయుక్తలో విచారణ జరుగుతుందని అధికారులు తెలిపారు. అక్రమంగ మట్టి తవ్వకాలు చేసి అక్కాచెల్లెళ్ల మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి

శామీర్‌పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలు పన్నులను సకాలంలో చెల్లించాలని కమిషనర్ జ్యోతి అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని బాబాగూడ, బొమ్మరాశిపేట, శామీర్‌పేట గ్రామాల్లో సోమవారం పన్నుల చెల్లింపు కోసం ప్రత్యేక సదస్సులను నిర్వహించారు. పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి దోహదపడాలన్నారు. ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీజేఐ గవాయ్‌పై దాడిచేసిన వారిని శిక్షించాలి

పరిగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు సీజేఐ గవాయ్‌పై దాడి చేసిన వారిని శిక్షించాలని ఎమ్మార్పీఎస్ పరిగి ఇన్‌చార్జి జి.రవికుమార్ డిమాండ్ చేశారు. పరిగిలో సోమవారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 17వ తేదీన తలపెట్టిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సురేష్, రత్నం, ప్రేమ్, మొగులయ్య, రాములు, సత్తయ్య, జంగయ్య పాల్గొన్నారు.

సుగుణ స్టీల్ కంపెనీని తరలించాలి

పరిగి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పరిగి శివారులోని సుగుణ స్టీల్ కంపెనీని మరో ప్రాంతానికి తరలించాలని రాఘవాపూర్ గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజావాణిలో సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కాంగ్రెస్ పార్టీ మండల ప్రధానకార్యదర్శి ఎం.సత్యానారాయణరెడ్డి, ఏర్పుల రాములు, జంగయ్య, జంబుల శ్రీనివాస్ ఉన్నారు.

ఎంపీ కోలుకోవాలని పూజలు

కులకచర్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి సోమవారం హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన శస్త్రచికిత్స జరిగింది. ఎంపీ త్వరగా కోలుకోవాలని బీజేపీ నాయకులు పాంబండ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ సర్పంచ్, దిశా కమిటీ అడ్వయిజరీ మెంబర్ జానకిరామ్, టెలికాం అడ్వయిజరీ బోర్డు మెంబర్ వెంకటయ్యగౌడ్, పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో రుద్రాభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు.

సంక్షిప్తంగా..

చెత్త సేకరణకు ట్రాక్టర్లు నడపాలి

మేడ్చల్ టౌన్: ఎల్లంపేట మున్సిపాలిటీలో చెత్త సేకరణకు ట్రాక్టర్లను నడపాలని సీపీఎం నాయకులు సోమవారం కమిషనర్ స్వామి నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ

దోమ: బడెంపల్లి తండా పాఠశాలలో విద్యార్థులకు తండావాసులు పాండునాయక్ సోమవారం స్పోర్ట్స్ డ్రెస్‌లు పంపిణీ చేశారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొడంగల్: కొడంగల్ అభివృద్ధి, పరిరక్షణ ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో మేము సైతం కొడంగల్ అభివృద్ధి కోసం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భీమరాజు, మాసాని వెంకటయ్య, ఎస్ఎం.గౌసన్, షాకీర్, లోకేశ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

దోమ: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో గ్యమానాయక్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. పాఠశాలలో వంట గది, సరుకులు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు.

ఉద్యోగి విజయ్‌కుమార్‌రెడ్డి మృతికి సంతాపం

దోమ: బొంపల్లి గ్రామానికి చెందిన ఉద్యోగి విజయ్‌కుమార్‌రెడ్డి కొన్ని నెలలుగా అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ గ్రామానికి వెళ్లి ఆయన మృతికి సంతాపం తెలిపారు.

విద్యార్థులకు స్నేహ ఫౌండేషన్ చేయూత

దోమ: దిర్సంపల్లి పాఠశాలలో స్నేహ ఫౌండేషన్ చైర్మన్ రాంరెడ్డి రూ.లక్ష ఖర్చు చేసి ఎల్ఈడీ టీవీని బహూకరించినట్లు ఎంఈవో వెంకట్ తెలిపారు.

ఇందిరమ్మ లిస్టులో పేర్లను సరిచేయాలి

బషీరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు లిస్టులో పేర్లు తప్పులున్నాయని, వాటిని సరిచేయాలని సోమవారం బషీరాబాద్ ప్రజావాణిలో సీనియర్ అసిస్టెంట్ శేర్‌ఖాన్‌కు లబ్ధిదారులు వినతపత్రం అందజేశారు. ఇందుకు సీనియర్ అసిస్టెంట్ స్పందిస్తూ గ్రామ కార్యదర్శులతో లబ్ధిదారుల పేర్లను సరి చేసేందుకు ఓ లేఖను తీసుకొచ్చి కార్యాలయంలో ఇవ్వాలని వారికి సూచించారు.

నీటి సమస్య పరిష్కారం

కోట్‌పల్లి: కేంద్రంలో నీటి సమస్య పరిష్కారానికి మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ సర్పంచ్ నక్కల విజయలక్ష్మి, తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా ఆయన స్పందించారు. కోట్‌పల్లి ఎస్సీ కాలనీ, దర్గా సైడ్ కాలనీల్లో బావుల నుంచి మోటార్లు ఏర్పాటు చేయించడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.